అన్నట్టుగానే షావుకారు షెడ్లు వేయించి కాంతయ్య దొడ్డినానుకొని గోడకట్టించాడు. ఇక దొంగకు దారేది? కాంతయ్యకు ఆనందంతో జ్వరం వచ్చినంత పనైంది. నిజంగానే వచ్చింది జ్వరం. కాంతయ్యకు పూర్వోత్తరసంగతులు తెలియటం లేదు. కామాక్షి పెత్తనాలుచేసే మనిషికాదు. మీనాక్షి 'పాడు'పుస్తకాలు చదువుతుంది కాని 'విలేఖరి'పని చేతకాదు.

మూడోనాడు కాంతయ్య స్థానిక దినపత్రిక చూచాడు. అది షావుకారుకు బ్రహ్మరథంపట్టడం చూచాక కాంతయ్యబుర్ర తిరిగిపోయింది. ప్రజల దారిలో షెడ్లు వేయించాడని దుమ్మెత్తి పోస్తారు నలుగురూ అని భయపడ్డాడు కాంతయ్య. అంతకు ముందురోజు పేపరు తెప్పించి చూశాడు.

అందులో ఇలా ఉంది: "ఈ ఊళ్ళో ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలిగించే బ్రహ్మచెవుడు వనమొకటి చిరకాలంనుండి వర్థిల్లుచున్నది." "షావుకారు షెడ్లగోడవే ఇబ్బందికి కారణం. ఈ సంగతి ఎత్తడే" అనుకొని మళ్ళీ చదివాడు. "దానిని గుర్తించిన శ్రీ గరటయ్య శ్రేష్ఠి బ్రహ్మచెవుడు డొంకల సమూలముగ చీల్చి చెండాడి ప్రజలకు రోడ్డు వేయించుటయేగాక క్రీడారంగము నొకటి యా స్థలమున నెలకొల్పిరి. ఆ రోడ్డుకు తారు పూయు ప్రణాళిక పంచాయితీబోర్డు వేయుచున్నది. గరటయ్య ధన్యజీవి."

రెండు ఫోటోలు కూడా వేశారు. ఒకటి ఆటస్థలానిది. దాని బ్యాక్‌గ్రౌండు కాంతయ్య పూరిల్లూ, ఆటలు మొదలెట్టిన 'బాలవానరులు' సగం పీకేసిన దడీని. కాంతయ్యకు ఏడుపొచ్చింది. ఇప్పుడు దొంగలబాధ ఇంకా పెరిగింది. ఆటస్థలం అవతలివైపు వల్లకాళ్లే. సాశ్రునేత్రాలతో గరటయ్య నగుమోముచూచి, తనివితీరా తనని తిట్టుకొని పేపరు మూశాడు కాంతయ్య. మర్నాడు షావుకారు షెడ్లోకి మారాడు కాంతయ్య.

స్కెచ్

# విద్యా "దొంగలు"

ఆర్. సూర్యనారాయణ

స్కూలు ఫైనలు పరీక్షలకి వాచరుగా ఆ వూరు పడిందనగానే మూర్తికి మొదట్లో భయం కలిగినమాటనిజం. ఆ సెంటరు చాలా యేండ్లనుంచీ ప్రసిద్ధి ఈ విషయంలో. అక్కడి విద్యార్థులు అన్నింటిలోనూ ఆరితేరిన వారని అక్కడకి వెళ్ళిన వాచర్లలో ఒకరో యిద్దరో తప్పకుండా తగురీతిని సత్కరించబడతారని, అందుకు అన్నికారణాలతో బాటు ఆ హెడ్మాష్టరుకూడా కొంత కారణం అనీ, యిలాంటి కథలెన్నో విన్నాడు. అందుకోసం వెళ్ళడానికి సంశయించాడుకూడా. కాని తనతోటి బి. యిడి. ఒకాయన నిస్సందేహంగా బయలుదేరడంతో అతనూ పోవడానికే నిశ్చయించాడు.

అసలు ఈ పరీక్షల విధానమే మూర్తికి నచ్చలేదు. ఎప్పుడో సత్యకాలంలో ప్రారంభించిన ఈ పద్ధతి యింకా అమలులోనేఉండి, వ్యతిరేక ఫలితాలనుకూడా యిస్తోందని అతని నమ్మకం. ఐనా స్థానబలిమి కలిగి, సులభోద్రేకులై, మిడి మిడి జ్ఞానంతో ఉన్న ఎదిగిన విద్యార్థులకు పరీక్షలో 'వాచ్' చేయడానికి ఎక్కడనుంచో ఒక్క ఉపాధ్యాయుణ్ణి, ఏ బలగమూ లేనివాణ్ణి, ఆ వూళ్లో సుంతైనా స్థానబలం లేనివాణ్ణివేస్తే ఏం ప్రయోజనమో అతనికి అర్థంకాలేదు. ఈ రోజుల్లో విద్యార్థులు మూడువంతులు అపసవ్యపుమార్గావలంబకులే అయ్యారు. పరీక్షల్లో తనవిధి తను ఉపాధ్యాయుడుగా, 'వాచరు'గా నిర్వహిస్తే విద్యార్థికి అది నష్టదాయకం అవుతోంది. కష్టం కలిగిన ఆ విద్యార్థి ఊరుకాని ఊళ్ళో ఈ దిక్కులేని ఉపాధ్యాయుణ్ణి ఏంచేసినా అంతూ దరీ కనుక్కునే నాథుడే ఉండడాయిరి. విద్యార్థి జీవితానికి మార్గదర్శకుడు కాదగ్గ ఉపాధ్యాయుడే

ఆ విద్యార్థులకి హడలి స్వధర్మ నిర్వహణకూడా మానుకోవలసిన రోజులొచ్చాయి!

దీనికి పరిష్కారంగా మూర్తికి ఒకటి తట్టింది. అది అందరికీ నచ్చదు కనక ఏ కొద్దిమందికో మాత్రం చెప్పాడు. ఇప్పుడు ఉపాధ్యాయుల్ని ఓ వూరునుంచి యింకోవూరు మార్చేబదులు ఒక స్కూల్లో విద్యార్థుల్నే యింకో స్కూలుకి-అంత దూరం కాకపోయినా—మార్చితే అన్నీ సర్దుకుంటాయి. పరాయిస్థలం అవడంవల్ల విద్యార్థులు నీళ్ళబయట చేపల్లా అయిపోతారు. ఉపాధ్యాయుడికి స్థానబలిమి ఉండడంవల్ల న్యాయం చెయ్యడానికి వీలవుతుంది. ఓ విధంగా విద్యార్థుల తండ్రులకి కూడా కొంతబాధ్యత తెలుస్తుంది. ఇంక ఈ నూతన విధాన నిర్వహణలోని ప్రత్యక్ష కష్టాలా అంటే వాటికి పరిష్కారమార్గం అంత కష్టం అయింది కాదు.

ఏమయితేనేం మూర్తికి తప్పలేదు. పరీక్షనాడు పెందరాళే చేరుకున్నాడు. హాల్లోకి వెళ్ళాక తానెలా ప్రవర్తించాలో ఒకసారి అనుకున్నాడు. వెధవది మొదటునుంచీ వచ్చిన సంస్కారంవల్ల చూస్తోచూస్తో అన్యాయం అధర్మం జరుగుతుంటే ఊరుకోలేడు తను. ఇంకా తన మనస్సుకి పదును తగ్గిపోలేదు. యువకరక్తం అనుకున్నా సరే, ఆత్మాదేశం అనుకున్నా సరే, అతను అధర్మాన్ని చూసి ఊరుకోలేడు. అయినా సాధ్యమైనంతవరకూ నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరిగి ధన్యుడనిపించుకోవాలి.

పరీక్షలు ప్రారంభించిన మొదటినాడే మూర్తికి ఆ సెంటరంటే చికాకు కలిగింది. మిగిలిన గదులవిషయం యేమోకాని తను పడ్డ గదిమాత్రం అబ్బ! దారుణం! మొదటినుంచి చివరదాకా ఒకటే దారుణం ఒకటే అన్యాయం. ఒక్కడూ చదివిన పాపాన పోయినట్టులేదు. పైగా సిగ్గులేక వచ్చిన వాచరునే అన్యాయానికి దోహదం చెయ్యమని అడిగేటంత ధైర్యవంతులైపోయారు విద్యార్థులు. స్వతంత్రభారతి ఎప్పటికి బాగుపడను? అలాగే అటూ యిటూ కాకుండా గడిపాడు నాల్గురోజులు.

పరీక్షలు రేపు ప్రొద్దున్నతో ఆఖరనగా ఈ ప్రొద్దున్న అతను పడ్డ గదిలో అందరూ నిక్కాకదేరినవారులు! సాధ్యమైనంతవరకూ మొదటలోనే పిరికిమందు పోయబోయాడు, మాటలతో హడలగొట్టాడు. చాలమటుకు కల్మషాన్ని తీసివేశాడు కూడా. వారంతా హాహాకారాలతో, నిరాశావాక్యాలతో, పేపర్లిచ్చి బయటికి పోయారు. ఒక గొప్ప విజయంలా భావించాడు మూర్తి.

మరునాడు పరీక్షలయ్యాక కాఫీకి పోతోంటే మూర్తి ప్రక్కనుంచి సైకిలు విసురుగా ఒకటి రెండు సారులు దూసుకుపోయినట్టు అయింది. పరకాయించి చూడగా ఆ సైకిలుమీద పోయేవాడు తను నిన్న పడ్డగదిలో విద్యార్థి అని జ్ఞాపకం వచ్చింది. అతనివాటం, రుసరుసలు, సన్నగా వినిపించినమాటలూ చూడగా అతనికెందుకో అనుమానం వేసింది. హృదయం ఓసారి దడదడలాడినట్టు కూడా తోచిందతనికి. అయినా సంగతేదో చూడాలని ఏదో మొండి ధైర్యం ఆవహించిందతనికి.

కాఫీత్రాగి తిరిగివస్తోంటే జనం పల్చగాఉన్న ఒకచోటునుంచి విసురుగా ఒక కంకరరాయివచ్చి నుదురుకి తగలడం, తను అనుమానిస్తున్న కుర్రాడు ఆ ప్రక్కనున్న కొట్లోకి పారిపోవడం ఒక్కసారి జరిగాయి. మూర్తి అ కుర్రాణ్ణిచూసి రక్తం చిమ్ముతున్న నుదురుని కూడా లెక్కచేయక పరుగెత్తుకుంటూ ఆ కొట్లో ప్రవేశించాడు. అజాగ్రత్తగా ఉన్న కుర్రాడు ఒక్కసారి గతుక్కుమని పారిపోబోయాడు. అప్పటికే అతనిచేతిని పట్టుకున్న మూర్తి పిడికిలిని విదలించుకో లేకపోయాడు. ఆ కుర్రాణ్ణి పట్టుకుని యీడ్చుకుని స్కూలువైపు పోతోంటే కొంతమంది కుర్రాళ్లు అడ్డుకుని ఆపడానికి ప్రయత్నించారు. కాని అతని మూర్తిని, అప్పటిఅతని గంభీరతని సహజంగా ఉండే బలాన్ని చూసిదగ్గరకి రాలేకపోయారు.

స్కూలుకి మూలగా ఉన్న ఓ గదిలో ఆ కుర్రాణ్ణి కూలేసి, మూర్తి గాయానికి ప్రథమచికిత్స చేశాడు. ఎదురుగావచ్చి కూర్చుంటూ అడిగాడు గంభీరంగా.

"నీ పేరు?"

"రామకృష్ణ..." తడబడుతూవచ్చింది సమాధానం.

"ఈ ఊరేనా?"

"ఊఁ!"

"అందుకే చేయగలిగావ్. అయినా ఎందుకు చేసినట్టు?"

"............"

"నిన్నే! నిన్న మా గదిలో అలా ఉన్నందుకేనా?"

"..............."

"అయితే నువ్వు చేసేది చూస్తూ ఊరుకోవాలన్న మాట."

"అంతకుముందొచ్చిన వారెవరూ అలా లేదు. మీ రొక్కరే అంత కఠినంగా ఉన్నారు. అందులోను నాకా సబ్జక్టు—"

"అసలే రాదుకదూ? పోనీ గట్టిగా చదవలేకపోయావ్? ఊఁహుఁ! ఆ పని చెయ్యరు. ఇదిమంచి మార్గంగా కనిపించింది. సరే! నేనంత యిదిగా ఉన్నా నువ్వు వెధవపని చెయ్యలేదా?"

తలవూపాడు రామకృష్ణ సమ్మతిగా.

"నీదగ్గరది యేవన్నా లాక్కున్నానా?"

"ఊఁహుఁ!"

"మరి నా కఠినత్వంవల్ల నీకు వచ్చిన నష్టంగాని కష్టంగాని యేముంది? నీ యిష్టంవచ్చినట్టు నువ్వు రాసుకున్నావుగా?"

"కాని మీరు వెనకాల నుంచోవడంవల్ల నాకు చేతులు—"

"—వణికాయి. అంత పిరికివాడివి ఆ వెధవపనికి ఎందుకు పాల్పడ్డావు? అంచేత పిరికితనంవల్ల నువ్వు చెయ్యలేకపోతే, నేను నీకు ప్రత్యేకంగా యే కఠినత్వం చూపకపోయినా, ఆ తప్పు నాదన్నమాట! అందుకని పరాయిచోటనుంచి వచ్చిన మాష్టర్ని —నీకు కాకపోవచ్చు—ఈ విధంగా గౌరవించడం యిప్పటి విద్యార్థులకి మంచిదని తోచిందన్నమాట!"

రామకృష్ణకి బుర్ర వేడెక్కిపోతోంది. అవును నిజంగా ఆయన తన విషయంలో యేమీ ప్రత్యేక కఠినత్వం చూపించనేలేదు. అందరి దగ్గరవీ లాక్కుని హడావిడిచేసేశాడు. అందుకు తనకి భయం వేయడం అయన తప్పా? తలెత్తి భయంగా చూశాడు. ఇందాక అద్దిన బోరిక్ పౌడరులోంచి కూడా వస్తున్న రక్తాన్ని గట్టిగా అద్దుతున్నాడు మూర్తి. మొహంలో కొంచెం బాధ కనిపిస్తోంది. తను చేసిన అమానుషకృత్యానికి ఎదటిప్రాణి అనుభవిస్తున్న బాధను ఊహించగలిగాడు రామకృష్ణ. వణికిపోయాడు. కుంచించుకుపోయాడు. మరి తను ఈ అఘాయిత్యం యెలా చేయగలిగాడు? ఆఁ! ఆనాడు గదిలోఉండి. ఈ మూర్తిగారి చేత నష్టపోయిన యితర విద్యార్థులు తనని ప్రోత్సహిస్తే, వుసిగొల్పితే. తను పిచ్చివాడై, తనకేం ప్రత్యేకంగా చేయని యింకో మాష్టర్ని...అని ఆలోచిస్తోంటే ఏమిటో బాధగా ఉంది అతనికి. ఇంతలో—

"ఇప్పుడు నీ పేరు, నీ నెంబరు పైవారికి తెలియజేస్తే నీగతి యేమవుతుందో తెలుసా?" అని గంభీరంగా వినిపించింది.

"......" మనసులో ఆందోళనగా ఉంది, రామకృష్ణకి. "అధమం రెండుమూడేళ్ళయినా నిన్ను 'డిబార్' చేయడం, నీ పుణ్యామాఅని ఈ వూరికి సెంటరు కాస్తాఊడడం జరుగుతుంది. నిన్నే, మాట్లాడవేం?" గర్జించినట్లు వచ్చింది మూర్తి స్వరం.

రామకృష్ణకి మాటలు తడబడ్డాయి. ఏం చెప్పగలడు తను? మూర్తి అన్నప్రకారం జరిగితే... అమ్మో! యింకేమన్నా ఉందా? ఆ ఆలోచనల్లో ఉండగానే మూర్తిదగ్గరకి వచ్చేశాడు. రామకృష్ణకీ ఎందుకో భయంవేసింది, మూర్తి ఆకారాన్ని చూస్తే, దగ్గరకివచ్చిన మూర్తి చెయ్యి పైకెత్తాడు: అప్రయత్నంగా రామకృష్ణ తనచేత్తో దవడని కప్పుకున్నాడు. అతని ఉద్దేశ్యం యింకో క్షణంలో తనగూబ—

"భుజంమీద చెయ్యివేస్తూ మూర్తి అతని మొహంలోకిచూస్తూ అన్నాడు, "ఇది నీకు పుట్టిన బుద్ధికాదు. చెప్పుడు మాటలువిని వెధవపని చేశావు. అయినా నావిధి నేను చేయకుండా, నిన్న వదలిపెట్టినందుకు నాకు మంచి గుణపాఠం నేర్పావు. నీవు కల్గించిన యీమచ్చ..."

మిగిలింది రామకృష్ణ వెక్కివెక్కి యేడుపుల ధ్వనిలో కలిసిపోయింది. మూర్తి ఆజ్ఞప్రకారం తలవంచుకునే వచ్చేశాడు బయటికి.

★